క్లుప్తంగా

న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే సూర్యాపేట

సూర్యాపేటటౌన్ : ప్రజలందరికీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మంగళ వారం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని, ఒకరికొకరు మంచిని పంచుతూ ఐక్యతను పెంచుకుందామన్నారు. అర్ధరాత్రి దాకా రోడ్లపై చక్కర్లు కొట్టకుండా కుటుంబ సభ్యులతో వేడుకలు జరుపుకోవాలన్నారు. 2024 అంతా శూన్యమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలే మిగిల్చిందన్నారు. 2025లోనైనా కనువిప్పు కలిగి అభివృద్ధికి అడుగులుపడాలని ఆశిద్దామన్నారు. 2025లో అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



మందుల సామేల్, ఎమ్మెల్యే తుంగతుర్తి

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100శాతం అమలు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

పౌరహక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : పౌరహక్కులను కాపాడాలని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమ్మాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, బాధ్యతలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, కుక్కడపు సైదులు, కె.ఉదయ్, వీరేష్, వెంకటయ్య, యాదగిరి, నర్సింహ, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్రగాయాలు

పెన్‌పహాడ్ : రైస్ మిల్లులో పనులు చేస్తున్న ఓ మహిళకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని దూపహాడ్ గ్రామ శివారులోని శ్రీరామా బిన్ని రైస్‌మిల్లులో ఈనెల 28న చోటు చేసుకుంది. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోపగాని దుర్గా రైస్‌మిల్లులో పనులు చేస్తుండగా ఆమె చున్ని బెల్టులో పడి గుంజుకుపోయి తీవ్రంగా గాయపడింది. గమనించిన కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రైస్ మిల్లు యజమాని పత్తిపాక నాగరాజు బెల్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే తన భార్య గాయపడిందని భర్త రాములు తెలిపాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చివ్వెంల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల మండల స్థాయి సోషల్ సబ్జెక్టు టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బోర ప్రసన్న, గమిని లావణ్య, వీరబోయిన శ్రీవాణి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండల వ్యాప్తంగా 8 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన 45మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం 16వ రోజు మహిళలు మంగళహారతులతో వచ్చి గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్యం.. 3లక్షల మొక్కలు

- ముమ్మరంగా నర్సరీల నిర్వహణ పనులు
- పూర్తయిన బ్యాగ్ ఫిల్లింగ్
- ప్రతి గ్రామంలో 12వేల మొక్కలు పెంచేందుకు ప్రణాళిక



అన్నారంలోని నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)



సింగారెడ్డిపాలెంలో తాటి, ఈత గింజలను సేకరిస్తున్న కూలీలు (ఫైల్)

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో అధికారులు మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా స్థలాలను ఎంపిక చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకు సంబంధించి మొక్కల పెంపకానికి నర్సరీల నిర్వహణ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సారి మండలంలో 3లక్షల మొక్కలు పెంచి నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందుకే అధికారులు గతేడాది కంటే ముందుగానే ఈసారి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేసిన నర్సరీలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో విత్తనాలు నాటే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం మండల అధికారులు నర్సరీలను సందర్శిస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలకు తగిన సూచనలు చేస్తున్నారు.

ప్రతినర్సరీలో 12వేలు మొక్కలు..

జిల్లా అధికారులు మండలానికి 3లక్షల మొక్కల పెంచాలని ఇచ్చిన లక్ష్యం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని కొత్తగా ఏర్పడిన చిన్న గ్రామపంచాయతీలు మినహా ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 12వేల మొక్కలు పెంచేందుకు అవసరమైన బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశారు. అదే విధంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రాంతాలను ముందుగానే గుర్తిస్తున్నారు.

కొనసాగుతున్న విత్తనాలు నాటే పనులు..

మండలంలోని 29గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇప్పటికే విత్తనాలు నాటే పనులు కొనసాగుతున్నాయి. నర్సరీల్లో ముఖ్యంగా తాటి, ఈత, కానుగ, నేరేడు, స్పటోడియా, గుల్మోరా, రాగి, మర్రి, చింత, సీతాఫలం, తులసీ, కలమంద మొక్కల విత్తనాలను ఎక్కువగా నాటిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద నాటుకునేందుకు వీలుగా గులాబీ, గన్నేరు, మందారం, నందివర్ధనం, బొప్పాయి, కరివేపాకు, మునగ, జామ, ధానిమ్మ, నిమ్మ మొక్కలకు సంబంధించిన విత్తనాలు సైతం నాటిస్తున్నట్లు వెల్లడించారు.

2025జూలై నాటికి మొక్కలు సిద్ధం



మండలంలో ఏర్పాటు చేసిన ఆయా నర్సరీల్లో బ్యాగ్‌ల్లో విత్తనాలు నాటించాం. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే విత్తనాలు మొలకెత్తాయి. 2025 జూలై నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వర్షాలు కురిసిన వెంటనే గుంతలు తీయించి మొక్కలు నాటిస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



కుశలవ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, అప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కుశలవ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడారు. కుశలవ 40సంవత్సరాలు పోలీసు శాఖలో సేవలు అందించడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఉన్న అనుభవాన్ని కొత్తగా విధుల్లో చేరిన వారికి అవసరమైన సమయంలో అందించడానికి అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కుశలవ కుటుంబ సభ్యులకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న న్యాయవాదులు

చివ్వెంల : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సూర్యాపేట పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, తోగటి మురళి, గూడూరి శ్రీనివాస్, ఎడిండ్ల అశోక్, తాళ్లపల్లి సత్యనారాయణ, డాకా శ్రీనివాస్‌నాయుడు, చల్లా లక్ష్మీకాంత్, కిశోర్, లింగయ్య, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేక్ కట్ చేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట : మహిళలు కుట్టుశిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 45వ వార్డులో గండూరి జానకమ్మ రామస్వామి మెమోరియల్ వాటర్‌ప్లాంట్‌లో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి సహకారంతో గత సంవత్సరం పాటు సుమారుగా 200మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం



సూర్యాపేట : కరపత్రాలు అందజేసి ప్రచారం చేస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట : కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఆర్టిజన్ కార్మికులతో కలిసి కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కంలను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాన్ని మొదలుపెట్టారని అన్నారు. దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లు తెచ్చి పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్లు గంపగుత్తగా ఔట్ సోర్సింగ్ చేయాలని ఆదేశించిందని, దేశానికి వెలుగును నింపే విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసి విద్యుత్ కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులను బజార్ పాలు చేసేందుకు విద్యుత్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. లాభాల్లో నడిచే విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మజూపడం మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, నరేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ఆపాలి

పెన్‌పహాడ్ : కేంద్రం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దూపహాడ్ సబ్‌స్టేషన్‌లో కార్మికులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక విధానాలు వినాశకర విధానాలను అవలంబిస్తుందన్నారు. ఇటీవల చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యుత్‌రంగ కార్మికులపై, ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దేవుల, గుంజ రామారావు, భార్గవ్, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో తగిన గుర్తింపు



తహసీల్దార్ కార్యాలయ సబార్డినేట్ లాల్‌మహ్మద్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్లు

అర్వపల్లి : ప్రభుత్వ ఉద్యోగులకు తాము అందించే సేవలతోనే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల తహసీల్దార్లు జక్కర్తి శ్రీనివాసులు, బ్రహ్మయ్య, అమీన్ సింగ్ అన్నారు. అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న షేక్ లాల్‌మహ్మద్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్‌లు రామరాజు జలేందర్ రావు, డి.కరుణాకర్, ఆర్ఐ ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ ఎంఏ. యాకూబ్‌పాష, వార్డు అధికారి చింతల వీరయ్య, రికార్డ్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారుల ఇరుముడి, అన్నదానం



తిమ్మాపురంలో హనుమాన్ మాలధారులతో నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గల వీరహనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ మాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు ఇరుముడులు ధరించి కొండగట్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా మాలధారులకు, గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, రత్నం లక్ష్మాజి, బొల్లం జానయ్య, బాలరాజు, సింహాద్రి, సైదులు, నరేష్, రాము, కిరణ్, నాగరాజు, యల్లయ్య, రామారావు, స్వాములు శ్రీకాంత్, వెంకట్‌నారాయణ, నాగయ్య, బాలమల్లు, నాగరాజు, గంగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సిబ్బంది

సూర్యాపేట టౌన్ : నూతన సంవత్సరం సందర్భంగా పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని రద్దీ ప్రాంతాలలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. అదే విధంగా నూతన సంవత్సర వేడుకలు ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఇళ్లలోనే జరుపుకోవాలని ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది అవగాహన కల్పించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

పెన్‌పహాడ్ : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని టీపీసీసీ కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మీసాల ప్రశాంత్‌కుమార్‌ను మంగళవారం మండల కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కత్తి రవీందర్, ఒగ్గు రవి, రాయి అచ్చయ్య, పల్లెపంగి సూరి, చిత్రం శంభయ్య, భూక్య శ్రీను పాల్గొన్నారు.

అనసూర్య చిత్రపటానికి నివాళి

సూర్యాపేట : మండలంలోని తాళ్లఖమ్మంపహాడ్ మాజీ సర్పంచ్ పాముల హన్మంతు మాతృమూర్తి పాముల అనసూర్య ఇటీవల మృతి చెందింది. మంగళవారం ఆమె చిత్రపటానికి మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం పూలమాల వేసి నివాళులర్పించారు.

వీరారెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి



నాగారం : వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు



నూతనకల్ : వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అర్వపల్లిలో..

నాగారం : విప్లవోద్యమ నేత యానాల వీరారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వీరారెడ్డి 34వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వీరారెడ్డి విద్యార్థి దశ నుంచే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడారని అన్నారు. దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా, పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం, భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన మహానీయుడని కొనియాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం తన తుది శ్వాస వరకు పోరాడి అమరుడైన వీరారెడ్డి ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ముందుగా నాగారం ఎక్స్‌రోడ్డులో ఉన్న వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపేట కాశయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, అరుణోదయ డివిజన్ అధ్యక్షుడు తడకమళ్ల సంజీవ, నాయకులు జాజుల సామేల్, బయ్యం లింగయ్య, కడారి సైదులు, జానీ, వీరేష్, పడిశాల సంజీవ, కొండం నాగరాజు, వంగూరి వెంకన్న, సోమయ్య, జానీ, ఎల్లయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : పీడీఎస్‌యూ నాయకుడు యానాల వీరారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వీరారెడ్డి 34వ వర్ధంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం పాపయ్య, బాణాల వెంకట్‌రెడ్డి, ఉప్పునూతల అంజయ్య, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యానాల వీరారెడ్డికి ఘన నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ నాయకుడు యానాల వీరారెడ్డి 34వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకుడు పోలెబోయిన పెదలింగయ్య, వడకాల బయ్యన్న, గోపయ్య, సురేష్, రాములు, అవిలమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఎస్సారెస్పీ కాల్వ మరమ్మతులు



వేల్పుచర్ల వద్ద ఎస్సారెస్పీ మైనర్ కాల్వలో జేసీబీతో పూడిక తీయిస్తున్న రైతులు

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు గాను గోదావరి జలాలు రెండు రోజుల్లో రానున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ కాల్వల్లో సాఫీగా నీరు పారేందుకు కాల్వ పరిధిలోని రైతులు స్వచ్ఛందంగా పూడిక తీత పనులు చేయిస్తున్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం నుంచి వేల్పుచర్ల మీదుగా కొమ్మాల వరకు వెళ్లే మైనర్‌కాల్వలో కంపచెట్లు, పూడిక నిండి ఉండడంతో సుమారు రూ.50వేల ఖర్చుతో వేల్పుచర్ల, అడివెంల, కొమ్మాల గ్రామరైతులు రెండు రోజులుగా జేసీబీతో పూడికతీత, కంపచెట్లు తొలగించే పనులు చేయిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, ఉగ్గం సతీష్, గైగుళ్ల అశోక్, వీరయ్య, జె.రమేష్, బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదావరి జలాలు విడుదల

తిరుమలగిరి, అర్వపల్లి: యాసంగి సీజన్‌కు గాను జిల్లాకు గోదావరి జలాలు బుధవారం విడుదల కానున్నాయి. జనగామ జిల్లా కొడకండ్ల వద్ద గోదావరి జలాలను సూర్యాపేట జిల్లాకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌లు పూజలు చేసి విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ డీఈ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. తొలుత 500 క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. వారబందీ విధానంలో ఈనెల 8వరకు జిల్లాకు గోదావరి జలాలు రానున్నాయి. ఆతర్వాత వారం రోజులు నిలిపివేసి తిరిగి మళ్లీ విడుదల చేయనున్నారు. గోదావరి జాలలను వృథా చేయకుండా, కాలువలకు నష్టం కలిగించకుండా వాడుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సేకరించి ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తేజశ్రీ, కారోబార్ భాస్కర్, నాయకులు మద్దెల భిక్షపతిగౌడ్, శివయ్య, హన్మంతు, సోమయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని కొమ్మాల, కాసర్లపహాడ్, అర్వపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మండల పంచాయతీ అధికారి టి.గోపి పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు నారాయణమూర్తి, నవీన్‌రెడ్డి, నెహ్రూ నాయక్, దస్తగిరి, మాగి నాగయ్య, శైలజ, పరుశరాములు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అర్వపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా గ్రామపంచాయతీ సిబ్బంది చూసుకోవాలని మండల పంచాయతీ అధికారి టి.గోపి కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో పారిశుద్ధ్య ఆయన పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట కార్మికులు ఉన్నారు.

న్యూ ఇయర్ సందడి



సూర్యాపేట పట్టణంలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న యువకులు



సూర్యాపేట : నల్లాలబావి వద్ద రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



సూర్యాపేట : శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కేక్ కట్ చేస్తూ న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు